సాక్షి
ఆదిలాబాద్

శనివారం । 1 । జూలై । 2023



కొట్నాక భీంరావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కేసీఆర్



భీం విగ్రహావిష్కరణలో కేసీఆర్, మంత్రి ఐకే రెడ్డి, ఎమ్మెల్సీ విఠల్, సీఎస్ శాంతికుమారి, విప్ సుమన్

జై భీం.. రాం రాం

- పోరాట యోధుడిని స్మరించి.. ఆదివాసీలకు అభివాదం చేసి..
- ఉత్సాహంగా సాగిన సీఎం కేసీఆర్ కుమురంభీం జిల్లా పర్యటన
- అట్టహాసంగా కలెక్టరేట్, ఎస్పీ, బీఆర్ఎస్ కార్యాలయాల ప్రారంభోత్సవం
- ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో పోడు పట్టాల పంపిణీకి శ్రీకారం



బహిరంగ సభకు హాజరైన ప్రజలు, అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్

ఆసిఫాబాద్: ఆదివాసీ పోరాటయోధుడు కుమురంభీ పుట్టిన గడ్డపై ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన శుక్రవారం ఉత్సాహంగా సాగింది. కుమురంభీం జిల్లాలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కోసం హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో మధ్యాహ్నం జిల్లా కేంద్రం ఆసిఫాబాద్‌కు చేరుకున్నారు. ముఖ్యమంత్రికి రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ హేమంత్ బోర్కడే పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. కుమురంభీం చౌక్‌కు చేరుకుని ఆదివాసీ వీరుడు కుమురంభీం విగ్రహాన్ని ఆవిష్కరించారు. పూలమాల వేసి నివాళులర్పించారు. తర్వాత బీఆర్ఎస్ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించారు. పార్టీ జెండా ఎగురవేసి తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కోనేరు కోనప్పను కుర్చీలో కూర్చోబెట్టి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చిల్డ్రన్స్ పార్కులో ఏర్పాటు చేసిన మాజీ మంత్రి కొట్నాక భీంరావు విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. ఆదివాసీలు గుస్సాడీ నృత్యాలతో ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు.

సమీకృత భవనం ప్రారంభం..

జిల్లా కేంద్రంలో రూ.52.50 కోట్లతో నిర్మించిన నూతన సమీకృత కలెక్టరేట్ భవన సముదాయాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ అంజనీకుమార్, మంత్రి ఐకే.రెడ్డి, హోంశాఖ మంత్రి మహమూద్ అలీ, ఆర్అండ్‌బీ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఆర్అండ్‌బీ కమిషనర్ గణపతిరెడ్డి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎస్పీ సురేశ్‌కుమార్, తెలంగాణ పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, కోనేరు కోనప్ప, ఎమ్మెల్సీ దండె విఠల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ హేమంత్ బోర్కడేను కుర్చీలో కూర్చోబెట్టారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. తర్వాత రూ.25.90 కోట్లతో నిర్మించిన జిల్లా పోలీసు కార్యాలయాన్ని ప్రారంభించారు. ఎస్పీ సురేశ్‌కుమార్‌ను కుర్చీలో కూర్చోబెట్టి అభినందించారు. సీఎంతోపాటు మంత్రులు, ఉన్నతాధికారులను కలెక్టర్, ఎస్పీ శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఆసిఫాబాద్‌ను కుమురంభీం జిల్లాగా ఏర్పాటు చేసి ఎంతో అభివృద్ధి సాధించామన్నారు. ప్రభుత్వ సేవలన్నీ సమీకృత కలెక్టరేట్ భవనంలో ఒకేచోట అందిస్తున్నామని పేర్కొన్నారు. సమీకృత కలెక్టరేట్ భవనాన్ని రాష్ట్రంలో 22వ సమీకృత కలెక్టరేట్ భవనంగా ప్రారంభించుకున్నామని తెలిపారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ స్వచ్ఛమైన నల్లా నీరందించడంతో ప్రజల ఆరోగ్యాలు మెరుగుపడ్డాయన్నారు.

పోడు పట్టాల పంపిణీ

దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న పోడు భూముల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా కేంద్రంలో సీఎం కేసీఆర్ లాంఛనంగా ప్రారంభించారు. ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకర్గాలకు చెందిన 12మంది లబ్ధిదారులకు పట్టా పాసుపుస్తకాలు అందజేశారు. సీఎం ఆదివాసీలను ఉద్దేశించి మాట్లాడుతూ గిరిజన సంప్రదాయం రీతిలో రాం రాం అంటూ అభివాదం చేశారు. మహిళల పేరుతో పట్టా పాసుపుస్తకాలు జారీ చేస్తున్నామని తెలిపారు. పోడు రైతులకు సైతం ఈ వానాకాలం నుంచే రైతుబంధు పథకం వర్తింపజేస్తామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 1.51 లక్షల మందికి 4.6 లక్షల ఎకరాల పోడు పట్టాలు ఇచ్చినట్లు వివరించారు. గిరిజనేతరులు 75 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నట్లు రుజువు చేస్తే వారిని కూడా అర్హులుగా గుర్తించి పట్టాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పోడు పట్టాలు పంపిణీ చేసిన క్రమంలో గతంలో పోడు భూములు ఆక్రమించిన గిరిజనులపై నమోదైన కేసులు ఎత్తివేస్తామని ప్రకటించారు. ఆసిఫాబాద్ నుంచి పోడు పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఇతర రైతుల తోపాటు వీరికి రైతుబంధు విడుదల చేయాలని ఆదేశాలు ఇస్తున్నామని పేర్కొన్నారు. అద్భుత కట్టడాలు కట్టిన ఘనత మంత్రి వేముల ప్రశాంత్, ఆర్అండ్‌బీ అధికారులదేనని కొనియాడారు. రూ.300 కోట్లతో మారుమూల ప్రాంతాల్లో త్రీఫేజ్ విద్యుత్ సరఫరా జరుగుతోందని, గిరివికాస్ పథకం కింద అర్హులైన రైతుల పొలాల్లో విద్యుత్ మోటార్లు బిగించినట్లు వివరించారు. జిల్లా కేంద్రంలో ఎస్పీ కార్యాలయం ఏర్పాటుతో రక్షణ వ్యవస్థ మరింత పటిష్టమైందన్నారు. దీంతో పాటు వైద్యకళాశాల మంజూరు చేసి భవన నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా సకల జనుల సమ్మెలో ఉద్యోగులు కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పుడే తెలంగాణ నాన్‌గెజిటెడ్ అధికారుల సంఘాన్ని అదే పేరుతో కొనసాగించడం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై వారికున్న నిబద్ధతను తెలియజేస్తుందన్నారు. విద్యుత్ కోతలు లేని తెలంగాణలో వ్యవసాయ రంగంతోపాటు పరిశ్రమలకు 24 గంటలు నిరంతర విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. కాగా, గాయకుడు సాయిచంద్ చిత్రపటానికి వేదికపై కేసీఆర్ నివాళి అర్పించారు.



కలెక్టరేట్ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న కేసీఆర్, మంత్రులు మహమూద్ అలీ, ప్రశాంత్‌రెడ్డి, ఐకేరెడ్డి



బహిరంగ సభ వేదికపై విప్ బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్సీలు పురాణం సతీశ్, నారదాసు లక్ష్మణ్‌రావు, ఎమ్మెల్యేలు సక్కు, కోనప్ప, రామన్న



కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి ఐకేరెడ్డి

అభివృద్ధికి హామీ

- కుమురంభీం జిల్లాకు సీఎం వరాలు
- రూ.75 కోట్లతో వార్ధా వంతెన
- మున్సిపాలిటీలు, జీపీలకు నిధులు మంజూరు

ఆసిఫాబాద్: నూతనంగా ఏర్పడిన కుమురంభీం జిల్లా అభివృద్ధికి సీఎం కేసీఆర్ భరోసానిచ్చారు. జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్ పక్కన ఏర్పాటు చేసిన ప్రగతి నివేదన సభ సక్సెస్ అయింది. నేతలు అంచనా వేసిన దానికంటే అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో సీఎం ఆశ్చర్యపోయారు. సభ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. సీఎం రాకకోసం సుమారు మూడు గంటలపాటు నిరీక్షించాల్సి వచ్చింది. మంచినీటి కోసం ప్రజలు ఇబ్బంది పడాల్సి వచ్చింది. సాయంత్రం.4.14 గంటలకు ప్రత్యేక వాహనంలో సభాస్థలికి చేరుకున్న సీఎం ప్రజలకు అభివాదం చేశారు. సుమారు 20 నిముషాలపాటు సాగిన ప్రసంగం ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి పోర్టల్ రద్దు చేస్తామని ప్రకటించడంపై.. ధరణి తీసేస్తే మళ్లీ పైరవీకారుల, దోపిడీదారుల రాజ్యం వస్తుంది. ధరణి ఉండాలా.. వద్దా? మీరే చెప్పండి... చేతులు లేపండనడంతో పలువురు చేతులు లేపారు. పోడు పట్టాలతో సీఎంకు జేజేలు పలికారు. అనంతరం రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా కుమురంభీం జిల్లా ఏర్పాటుతో అభివృద్ధి వేగవంతమైందన్నారు. ఆదివాసీలకు పట్టాలివ్వడం సంతోషకరమైన దినమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కోనప్ప మాట్లాడుతూ నాగమ్మ చెరువు అభివృద్ధికి రూ.5 కోట్లు ఇవ్వాలని కోరారు. గిరజనేతరులకు కూడా రైతుబంధు వర్తింపజేయాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ హయాంలో అన్నిరంగాల్లో జిల్లా అభివృద్ధి చెందుతుందన్నారు. ఎమ్మెల్యే సక్కు మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో పోడు పట్టాలు పంపిణీ అభినందనీయమన్నారు. కుమురంభీం, వట్టివాగు ప్రాజెక్టుల కాల్వల స్థిరీకరణకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

నిధులు మంజూరు..

ఎమ్మెల్యే కోనప్ప విన్నపం మేరకు నిధులు అడిగిన వెంటనే సిర్పూర్ నియోజకవర్గంలోని గుండాయిపేట్- నందివర్ల వద్ద వార్ధా నదిపై వంతెన నిర్మాణానికి రూ.75 కోట్లు మంజూరు చేశారు. అలాగే కౌత్మర్- దహెగాం వరకు డబుల్ రోడ్ నిర్మాణానికి రూ.32 కోట్లు మంజూరు చేశారు. కాగజ్‌నగర్‌లో ఐటీఐలో మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆసిఫాబాద్, మంచిర్యాలలోని 9 మున్సిపాటిలీలకు ఒక్కో మున్సిపాలిటీకి రూ.25 కోట్లు, గ్రామ పంచాయతీలకు రూ.10 లక్షల చొప్పున మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

సంతోషంగా ఉంది..

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 30 జిల్లాలో రూ.1,649 కోట్లతో సమీకృత కలెక్టరేట్ భవనాలు నిర్మించగా, ఇప్పటి వరకు 21 పూర్తి చేసినట్లు వెల్లడించారు. 22వ జిల్లాగా కుమురంభీం ఆసిఫాబాద్‌లో సమీకృత కలెక్టరేట్ భవనం ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ క్రమంలో ప్రజలకు పరిపాలన అతి చేరువలో ఉంటుందన్నారు. గతంలో ఉమ్మడి జిల్లా ప్రజలకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ఇబ్బందులు పడేవారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి దార్శనికతతో జిల్లాల విభజన చేసి ప్రతి జిల్లాను అత్యంత వేగంగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. తండాలు, గూడేలను గ్రామ పంచాయతీలుగా మార్చి గిరిజనుల సాధికారతకు కృషి చేస్తున్నామని తెలిపారు. గిరిపుత్రులకు ఎంతోకాలంగా సాగు చేసుకుంటున్న పోడు భూములకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పట్టాలు పంపిణీ చేస్తున్నామని, పట్టాలు పొందిన వారికి రైతుబంధు సైతం వర్తిస్తుందని వివరించారు. దేశంలో అత్యధిక పోడు పట్టాలు పంపిణీ చేసిన రాష్ట్రంగా తెలంగాణ 3వ స్థానంలో నిలిచిందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో ఐడీసీ చైర్మన్ వేణుగోపాలాచారి, నిర్మల్ జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, కుమురంభీం మనవడు కుమురం సోనేరావు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, ముధోల్ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్, బోథ్ ఎమ్మెల్యే బాపురావు, మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్ రావు, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మరో మూడు కొత్త మండలాలు

- సీఎం కేసీఆర్ గ్రీన్‌సిగ్నల్
- ఆసిఫాబాద్‌లో జిల్లా నేతల సమక్షంలో జీవో జారీకి ఆదేశాలు



సీఎంవో సెక్రెటరీతో ఫోన్‌లో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, పక్కన ఎమ్మెల్యే రామన్న తదితరులు

కైలాస్‌నగర్: జిల్లాలో మరో మూడు కొత్త మండలాలు ఏర్పాటు కానున్నాయి. ఈమేరకు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో శుక్రవారం పర్యటించిన సీఎం కేసీఆర్‌ను కలిసిన జిల్లా నాయకులకు వీటి ఏర్పాటుపై స్పష్టమైన హామీ లభించింది. దీంతో కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సొనాల, సాత్నాల, భోరజ్ మండలాల ఏర్పాటుకు లైన్‌క్లియర్ అయింది. ఇందుకు సంబంధించిన జీవో జారీచేయాలని సీఎం ఆదేశించినట్లుగా నాయకులు చెబుతుండటంతో త్వరలోనే ఆయా ప్రాంతాల ప్రజల ఆకాంక్ష నెరవేరేలా కనిపిస్తోంది. సీఎం నిర్ణయంపై ఆయా గ్రామాల ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది.

19 గ్రామాలతో భోరజ్

జైనథ్ మండలం భౌగోళికంగా విశాలంగా ఉంది. గతంలో 29 గ్రామ పంచాయతీలతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పెద్ద మండలంగా నిలిచింది. బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త జీపీల ఏర్పాటుతో ఈ మండలంలోని పంచాయతీల సంఖ్య 52కు చేరింది. ఇందులోని కొన్ని జీపీలను విడదీసి సాత్నాల మండలంగా ఏర్పాటు చేయాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. జైనథ్ మండలంలోని పెండల్వాడ, బాలాపూర్, సావాపూర్, లేఖర్‌వాడ, సాంగ్వి, గిమ్మ, ఆకోలి, కోర్టా, మాండగడ, పిప్పర్‌వాడ, తరోడ, కామాయి, ఆకూర్ల, గూడ, సిర్సన్న, రాంపూర్, పూసాయి వంటి 19 గ్రామాలతో భోరజ్ కేంద్రంగా కొత్త మండలం ఏర్పాటు చేయాలని ఆయా పంచాయతీల సర్పంచ్‌లు తీర్మానాలు చేసి అప్పటి కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు ప్రతిపాదనలు పంపించారు. ఎమ్మెల్యే ద్వారా విషయాన్ని ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు.

13 గ్రామాలతో సొనాల..

బోథ్ మండలంలో కొనసాగుతున్న సొనాల కేంద్రంగా 13 గ్రామాలతో కూడిన కొత్త మండలం ప్రకటించాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీపీ తీర్మానాలు చేసి ప్రభుత్వానికి నివేదించారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో దీని ఏర్పాటుకు స్వయంగా సీఎం కేసీఆర్ కూడా హామీ ఇచ్చారు. అప్పట్లో నూతన మండలాల ఏర్పాటు సమయంలో సొనాల పేరు లేకపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఉద్యమించారు. మంత్రి కేటీఆర్ దృష్టికి సైతం తీసుకెళ్లారు. ఆయన హామీతో ఆందోళన విరమించారు.

11 గ్రామాలతో సాత్నాల

జైనథ్, బేల, ఆదిలాబాద్ రూరల్ మండలాల్లోని 11 గ్రామాలతో సాత్నాల కేంద్రంగా కొత్త మండలం ఏర్పాటు చేస్తామని సీఎం కేసీఆర్ స్వయంగా హామీ ఇచ్చారు. నాలుగేళ్లు గడిచినా ఇది కార్యరూపం దాల్చలేదు. ఏడాది క్రితం భోరజ్ తెరపైకి రావడంతో సాత్నాల మండలంగా ఏర్పాటువుతుందా అనే సందేహాలు తలెత్తాయి. ఆదివాసీ నాయకులు దీనిపై ఆందోళనలు సైతం చేపట్టారు.

ముఖ్యమంత్రి గ్రీన్ సిగ్నల్

భోరజ్, సాత్నాల, సొనాల కొత్త మండలాల ఏర్పాటుకు సీఎం కేసీఆర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లుగా జిల్లా నాయకులు చెబుతున్నారు. మంత్రి ఐకే రెడ్డి ఆధ్వర్యంలోఎమ్మెల్యే రామన్న, మాజీ ఎంపీ గోడం నగేశ్, ఎంపీపీ తుల శ్రీనివాస్, జెడ్పీటీసీ అనిల్ జాదవ్ శుక్రవారం ఆసిఫాబాద్‌లో సీఎంను కలిసి మండలాల ఏర్పాటుపై నివేదించారు. స్పందించిన కేసీఆర్ అప్పటికప్పుడు సీఎంవో సెక్రటరీ నర్సింగ్‌రావుతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే జీవో జారీ చేయాలని ఆదేశించినట్లుగా ఆ నాయకులు చెబుతున్నారు.

నేడు గ్రూప్-4 పరీక్ష

కైలాస్‌నగర్: జిల్లాలో శనివారం నిర్వహించనున్న గ్రూప్-4 పరీక్షకు యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. జిల్లా వ్యాప్తంగా 17,771 మంది అభ్యర్థులు హాజరుకానుండగా 54 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పేపర్-1 పరీక్ష ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, పేపర్-2 మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించనున్నారు. అభ్యర్థులు 15 నిమిషాల ముందుగానే కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత గేట్లు మూసివేస్తామని, ఆలస్యంగా వచ్చే వారిని లోనికి అనుమతించమని అధికారులు స్పష్టం చేశారు. జిల్లాలో కేటాయించిన పలు కేంద్రాల్లో ఏర్పాట్లను కలెక్టర్ రాహుల్‌రాజ్ పరిశీలించారు.

పకడ్బందీ ఏర్పాట్లు..

గ్రూప్-4 పరీక్ష ప్రశాంత వాతావరణంలో, పకడ్బందీగా నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. పరీక్షల నిర్వహణపై టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్ రెడ్డి శుక్రవా రం హైదరాబాద్ నుంచి ఆయా జిల్లాల కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈమేరకు తీసుకోవా ల్సిన జాగ్రత్తలపై కలెక్టర్లకు ఆయన దిశా నిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పరీక్షల నిర్వహణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందులో అదనపు కలెక్టర్ ఎస్. నటరాజ్, కలెక్టరేట్ పర్యవేక్షకులు రాంరెడ్డి పాల్గొన్నారు.

'క్రీడా' ప్రవేశాలకు వేళాయె

- స్పోర్ట్స్ స్కూళ్లలో 4,5 తరగతుల్లో అడ్మిషన్స్
- మూడు పాఠశాలల్లో 240 సీట్లు
- నేటి నుంచి మండలస్థాయి ఎంపిక పోటీలు



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని క్రీడా పాఠశాల

ఆదిలాబాద్: చిన్నారులకు బాల్య దశ నుంచే శిక్షణ ఇచ్చి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మూడు క్రీడా పాఠశాలలను ఏర్పాటు చేశారు. ఇందులో నాణ్యమైన విద్యాబోధనతో పాటు వారికి ఆసక్తి ఉన్న క్రీడాంశాల్లో అత్యుత్తమ శిక్షణ అందజేస్తారు. ఇక్కడ విద్యాభ్యాసం పూర్తి చేసిన చాలామంది క్రీడాకారులు సర్కారు కొలువులు కైవసం చేసుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మూడు క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. నేటి నుంచి మండలస్థాయి పోటీలు ప్రారంభం కానున్నాయి. ఇందులో ప్రతిభ కనబరిచిన వారు జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలకు అర్హులవుతారు. రాష్ట్రస్థాయిలో మెరిట్ ఆధారంగా 4,5 తరగతుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

3 పాఠశాలలు...240 సీట్లు

రాష్ట్రంలో మేడ్చల్ జిల్లా హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లా కేంద్రాల్లో క్రీడా పాఠశాలలు ఉన్నాయి. హకీంపేటలో ఇంటర్ వరకు బోధిస్తుండగా, కరీంనగర్, ఆదిలాబాద్ పాఠశాలల్లో పదో తరగతి వరకు చదువుకునే అవకాశం ఉంది. ఈ విద్యా సంవత్సరానికి (2023-24) సంబంధించి ఒక్కో పాఠశాలలో 4, 5 తరగతుల్లో ప్రవేశాలకు అవకాశం కల్పించారు. ఒక్కో తరగతిలో 20 మంది బాలికలు, 20 మంది బాలురకు ప్రవేశాలుంటాయి. మూడు అంచెల్లో నిర్వహించిన పోటీల్లో భాగంగా ఎంపికైన చిన్నారులకు క్రీడా పాఠశాలల్లో అథ్లెటిక్స్, ఆర్చరీ, సెపక్ తక్రా, సెయిలింగ్, ఫెన్సింగ్, ఫుట్‌బాల్, వెయిట్ లిఫ్టింగ్, జిమ్నాస్టిక్స్, వాలీబాల్, బాక్సింగ్, యోగా, కయాకింగ్, రోయింగ్ వంటి క్రీడా విభాగాల్లో శిక్షణ ఇస్తారు.

ఎంపిక పోటీలివిగో...

- **30మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్:** బాలురు 4.4, బాలికలు 4.6సెకన్లలో నిర్దేశించిన దూరాన్ని చేరుకోవాలి.
- **స్టాండింగ్ బ్రాడ్ జంప్:** బాలురు 36 సెం.మీ, బాలికలు 34 సెం.మీ దూరం దూకాల్సి ఉంటుంది.
- **800 మీటర్ల పరుగు:** బాలురు 3.06 నిమిషాల్లో, బాలికలు 3.19 నిమిషాల్లో నిర్దేశించిన దూరాన్ని చేరుకోవాలి.
- **6"10 మీటర్ల షటిల్ రన్:** బాలురు 16.4 సెకన్లు, బాలికలు 17.1 సెకన్లలో 10 మీటర్ల దూరాన్ని ఆరు సార్లు పరుగెత్తాలి.
- **మెడిసిన్ బాల్ త్రో:** బాలురు 2.77 మీటర్లు, బాలికలు 2.48 మీటర్ల దూరం బంతిని విసరాలి.
- **వర్టికల్ జంప్:** బాలురు 194 సెం.మీ., బాలికలు 181 సెం.మీ. ఎత్తు ఎగరాలి.
- **ఫ్లెక్సిబిలిటీ టెస్ట్:** ఈ పరీక్షలో చిన్నారులను బల్లపై నిల్చోబెడతారు. వారు చేతులతో వారి పాదాలను తాకాల్సి ఉంటుంది. మోకాళ్లు వంచకుండా ఎంత కిందకి వంగితే అంత ఫ్లెక్సిబిలిటీ ఉన్నట్టు.

పోటీలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు..

వయస్సు, జనన, విద్యాభ్యాస (3, 4వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్టులు)
పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు: (10)

అర్హులెవరంటే..

- నాలుగో తరగతిలో ప్రవేశం పొందగోరే విద్యార్థులు మూడో తరగతి ఉత్తీర్ణులై, 1.09.2013 నుంచి 31.08.2014 లోపు జన్మించి ఉండాలి. బాలురు 24 కిలోల బరువు, 127 సెం.మీ ఎత్తు, బాలికలు 23 కిలోల బరువు, 123 సెం.మీ. ఎత్తు కలిగి ఉండాలి.
- ఐదో తరగతిలో ప్రవేశం పొందగోరే విద్యార్థులు నాలుగో తరగతి ఉత్తీర్ణులై, 1.9.2012 నుంచి 31.08.2013 లోపు జన్మించి ఉండాలి. బాలురు 26 కిలోల బరువు,130సెం.మీ ఎత్తు, బాలికలు 25 కిలోల బరువు, 129 సెం.మీ. ఎత్తు కలిగి ఉండాలి.

మూడు స్థాయిల్లో..

మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన వారికి ఆయా ఈ పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించనున్నారు.
మండల్ లెవెల్: ఈ పోటీలు నేటి నుంచి ఈనెల 5వ తేదీ వరకు కొనసాగనున్నాయి.
డిస్ట్రిక్ట్ లెవెల్: ఈ పోటీలను ఆయా జిల్లా కేంద్రాల్లో ఈనెల 9నుంచి 15 వరకు చేపట్టనున్నారు.
స్టేట్ లెవెల్: రాష్ట్రస్థాయి పోటీలను హకీంపేట క్రీడా పాఠశాలలో ఈనెల 24నుంచి 30 నిర్వహించనున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు జోనల్ వారీగా పరిశీలిస్తే మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల వారికి 24న, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల వారికి 25న పోటీలు ఉండనున్నాయి.

క్లుప్తంగా

కలెక్టర్, తహసీల్దార్‌పై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు



కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్న వినోద్ నాయక్

సిరికొండ/ఇంద్రవెల్లి: ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గంలోని ఇంద్రవెల్లి, సిరికొండ మండలాల్లో గిరిజన ప్రజలకు కనీస అవసరాలు తీర్చడంలో విఫలమైన కలెక్టర్, తహసీల్దార్‌పై మానవ హక్కుల కమిషన్‌కు హైదరాబాద్‌లో శుక్రవారం ఏఐసీసీ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కో ఆర్డినేటర్ వినోద్‌నాయక్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రజల హక్కులైన తాగునీరు, రోడ్డు సౌకర్యాలు, వైద్యం, విద్యను స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్లు దాటినా నేటికీ వారి దరిచేరడం లేదని, మండలంలోని అమాయక గిరిజనులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో కలెక్టర్, తహసీల్దార్‌లు పూర్తిగా విఫలమయ్యారని పేర్కొంటూ మానవ హక్కుల కమిషన్‌కు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. ఇకనైనా గ్రామాల్లో మెరుగైన వసతులు కల్పించి వారి సమస్యలు తీర్చాలని కోరారు.

ఆరుగురిపై కేసు నమోదు

ఇంద్రవెల్లి: మండలంలోని దనోరా (బి) గ్రామంలోని గోడౌన్ వద్ద లారీ డ్రైవర్‌పై దాడి చేసిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సునీల్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం... శుక్రవారం దనోరా (బి) గ్రామ సమీపంలోని గోడౌన్ వద్ద రాకేష్ అనే డ్రైవర్ అందరితో పాటు తన లారీని క్యూలో ఉంచాడు. ఆదిలాబాద్ లారీ అసోసియేషన్‌కు చెందిన అక్బర్, సర్దార్, అప్సర్, సందీప్, ముస్తాఫ, హర్షద్‌లు లారీని ఎందుకు క్యూలో ఉంచావని గొడవకు దిగారు. అనంతరం ఇనుపరాడుతో తలపై బాదడంతో గాయాలయ్యాయి. దీంతో రాకేష్ ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జనావాసాల్లోకి జింకపిల్ల



జింక పిల్లను పోలీసులకు అప్పగిస్తున్న గ్రామస్తులు

ముధోల్: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఉదయం 10:30 గంటల సమయంలో జింక పిల్ల రావడంతో స్థానికులు గుర్తించారు. ఆ జింక పిల్ల నీరసంగా ఉండడంతో దానిని పట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సాయికిరణ్‌కు అప్పగించారు.

చిన్నారుల భవిష్యత్‌కు బాటలు

- తల్లిదండ్రుల చెంతకు బాలకార్మికులు, తప్పిపోయిన చిన్నారులు
- నెల రోజుల పాటు ఆపరేషన్ ముస్కాన్
- నేటి నుంచి మొదలు..



ఆదిలాబాద్ పట్టణంలోని ఓ బేకరిలో తనిఖీలు చేస్తున్న అధికారులు (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: వివిధ పనుల్లో బంధీగా మారిన చిన్నారుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేసేందుకు ఆపరేషన్ ముస్కాన్ దోహదపడనుంది. వివిధ ప్రాంతాల్లో తప్పిపోయిన చిన్నారులను వారి తల్లిదండ్రుల చెంతకు చేర్చేవిధంగా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతోంది. దీంతో ఎందరో చిన్నారులు పనుల నుంచి విముక్తి పొందగా, ఇతర రాష్ట్రాల నుంచి తప్పిపోయిన వారిని గుర్తించి వారి కుటుంబీకులకు అప్పగించడం జరుగుతోంది. పోలీసుశాఖతో పాటు బాలల సంరక్షణ సమితి, కార్మిక శాఖ సమన్వయంతో నెలరోజుల పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టనున్నారు. గుర్తించిన పిల్లలను సీడబ్ల్యూసీ కమిటీ ముందుంచి వారి తల్లిదండ్రులకు అప్పగిస్తున్నారు. ఐసీపీఎస్, పోలీసు శాఖ, కార్మిక శాఖ ఆధ్వర్యంలో సంవత్సరానికి రెండుసార్లు నెలరోజుల పాటు ఈ కార్యక్రమాన్ని చేపడుతుండగా ఈ నెల 1 నుంచి 31వ తేదీ వరకు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం కొనసాగనుంది.

నిరంతర పర్యవేక్షణ కరువు..

తప్పిపోయిన చిన్నారులను తల్లిదండ్రుల చెంతకు చేర్చడానికి, పని నుంచి విముక్తి కలిగించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది. ఈ ఆపరేషన్ ద్వారా పిల్లలను కుటుంబీకులకు అప్పగించినా కొన్ని రోజుల తర్వాత వారు మళ్లీ యదాస్థితిలోనే కనిపిస్తున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. నిరంతరం పర్యవేక్షించాల్సిన కార్మిక శాఖ, ఐసీపీఎస్, విద్య శాఖాధికారులు నామమాత్రంగా వ్యవహరిస్తున్నారు.

బంధీ నుంచి విముక్తి పొందించేలా..

ఆడిపాడుతూ సంతోషంగా గడపాల్సిన బాల్యం ఇటుక బట్టీలు, హోటళ్లు, చెత్తకుప్పలు, మురికి కూపాల్లో మగ్గుతోంది. కొంతమంది తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితులు సరిగ్గా లేక పిల్లలను పనుల్లో పెడుతున్నారు. దీంతో వారి భవిష్యత్ నాశనం అవుతుంది. వీరందరిని విముక్తి కల్పించేందుకు ప్రభుత్వం ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని చేపడుతోంది. జనవరిలో ఆపరేషన్ స్మైల్, జూలై నెలలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఇందుకు జిల్లాలో రెండు బృందాలున్నాయి. ఆదిలాబాద్ పరిధిలో ఒకటి, ఉట్నూర్‌లో మరో బృందం పనిచేస్తోంది. ఈ బృందంలో



అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

నలుగురు కానిస్టేబుళ్లు, నలుగురు ఐసీపీఎస్ సిబ్బంది, కార్మిక శాఖాధికారులు ఉంటారు. గుర్తించిన పిల్లలను సీడబ్ల్యూసీ ముందు హాజరుపర్చి వారి తల్లిదండ్రులకు అప్పగిస్తారు. జనవరిలో నిర్వహించిన ఆపరేషన్ స్మైల్‌లో జిల్లాలో 106మందిని గుర్తించారు. వీరిలో బాలికలు 14మంది, బాలురు 92మంది ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు, ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన ఒకరు, మహారాష్ట్రకు చెందిన ముగ్గురు, నేపాల్‌కు చెందిన ఒకరు, రాజస్థాన్‌కు చెందిన మరొకరు, ఉత్తరప్రదేశ్‌కు చెందిన 15మంది, పశ్చిమ బెంగాళ్‌కు చెందిన ఇద్దరు, దీంతో పాటు తెలంగాణలోని ఇతర జిల్లాలకు చెందిన 79మంది చిన్నారులను తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. 2019లో 373 మందిని, 2021లో 185 మందిని, 2022లో 123 మందిని, 2023 జనవరిలో 106 మంది చిన్నారులను తల్లిదండ్రుల చెంతకు చేర్చారు.

పకడ్బందీగా అమలు చేస్తాం..



ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తాం. పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరం. తప్పిపోయిన, బంధీ అయిన చిన్నారులను ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం ద్వారా గుర్తించి వారి తల్లిదండ్రుల చెంతకు చేర్చుతున్నాం. బడిబయట ఉన్న, హోటళ్లలో పనిచేస్తున్న పిల్లలను గుర్తించి వారికి విముక్తి కలిగించేలా చర్యలు చేపడుతున్నాం.

– రాజేంద్రప్రసాద్, ఐసీపీఎస్ అధికారి, ఆదిలాబాద్

బీజేపీతోనే సుస్థిర పాలన

- బీఆర్‌ఎస్ హయాంలో అవినీతికి ప్రాధాన్యత
- ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు



మాట్లాడుతున్న ఎంపీ సోయం బాపూరావు

ఇచ్చోడ: బీజేపీ ద్వారానే సుస్థిర పాలన సాధ్యమని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు సోయం బాపూరావు అన్నారు. శుక్రవారం ఇచ్చోడ మండలంలోని నవేగావ్‌లో మహాజన్ సంపర్క్ అభియాన్ ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ అవినీతికే ఎక్కువ ప్రాధాన్యతనిస్తుందని ఆరోపించారు. బీఆర్‌ఎస్‌లో గల్లీ నుంచి ఢిల్లీ స్థాయి నాయకుల వరకు అవినీతికి పాల్పడుతూ ప్రజల సొమ్మును దొచుకుంటున్నారని తెలిపారు. కేంద్రంలో మరోసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని వివరించారు. సుస్థిర పాలన అందించడం కేవలం బీజేపీతోనే సాధ్యమన్నారు. గ్రామాల్లో నిర్మించిన పల్లెప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, సీసీ రోడ్ల నిర్మాణలు అన్నీ కేంద్ర ప్రభుత్వ నిధులేనని తెలిపారు. కేంద్రం నిధులతో రాష్ట్ర ప్రభుత్వం తామే నిర్మించినట్లు ప్రచారం చేసుకుంటుందని వివరించారు. నవేగావ్‌లో తాగునీటి సమస్యతో ఇబ్బందులకు గురవుతున్నామని, కాలనీవాసులు ఎంపీకి విన్నవించగా వెంటనే తన నిధులు నుంచి బోరుబావిని వేయించినట్లు తెలిపారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అడేమానాజీ, జిల్లా ఉపాధ్యక్షులు మాదవ్‌అమ్టె, కధంబాబారావు, అసెంబ్లీ కన్వీనర్ సూర్యకాంత్ గిత్తె, దక్షణ మధ్య రెల్వేబోర్డు సభ్యులు జివి.రమణ, పార్టీ మండల అధ్యక్షులు కేంద్రే నారాయణఉన్నారు.

విద్యుత్‌షాక్‌తో పంచాయతీ కార్మికుడి మృతి

- అధికారుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆందోళన
- బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్
- మండల అధికారులు, పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన ఆందోళన



దత్తా మానే మృతదేహం

గుడిహత్నూర్: వీధి దీపాలు బిగిస్తున్న పంచాయతీ కార్మికుడు విద్యుత్ షాక్‌తో మృతిచెందిన సంఘటన మండలంలోని కొల్హారీ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... కొల్హారీ గ్రామ పంచాయతీ కార్మికుడు దత్తా మానే (40) రెండు రోజుల నుంచి వీధి దీపాలు బిగిస్తున్నాడు. శుక్రవా రం సైతం వీధి దీపాలు బిగించడానికి కరెంట్ సరఫరా నిలిపి వేసి స్తంభంపై బల్బులు బిగిస్తున్నాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా కరెంటు సరఫరా కావడంతో షాక్‌కు గురై కింద పడి మృతి చెందాడు. విష యం గ్రహించిన తోటి కార్మికులు వెంటనే అధికారులకు సమాచారం అందించి కరెంటు సరఫరా నిలిపి వేయించారు. బంధువులు, కుటుంబ సభ్యులు చేరుకుని మృతదేహాన్ని తరలించబోమని భీష్మించుకు కూర్చున్నారు. విద్యుత్ శాఖ, పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో దత్తా మృతి చెందాడని, అతడి కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళనకు దిగారు. దీంతో తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో సునీత, ఏఎస్సై బలిరాం, విద్యుత్ శాఖ డీఈ సుభాష్, ఏఈ గౌతంలు సంఘటనా స్థలానికి చేరుకొని బంధువులను సముదాయించారు. వివిధ శాఖల ద్వారా మృతుడి కుటుంబానికి ఆర్థికంగా ఆదుకుంటామని చెప్పడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య గంగాసాగర్, కుమార్తెలు గౌతమి, మౌనిక, కుమారుడు నమోదర్శి ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు.

'ప్రజా సేవ కోసమే వీఆర్‌ఎస్ తీసుకున్న'



శ్యామ్‌నాయక్‌ను సన్మానిస్తున్న సంఘాల నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: పేదలకు సేవ చేయాలనే ఉద్యోగానికి స్వచ్ఛంద విరమణ తీసుకున్నట్లు డెప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషన్, తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అజ్మీర శ్యామ్‌నాయక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ సంఘ భవనంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఉద్యోగ సంఘాలు, కుల సంఘాలు, రాజకీయ నాయకులు ఆయనను శాలువతో ఘనంగా సత్కరించి పుష్ప గుచ్ఛాలను అందజేశారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీజీఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, హైదరాబాద్ సంఘం అధ్యక్షుడు కృష్ణయాదవ్, టీజీఓ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎంజులరెడ్డి, నిజామాబాద్ రవాణ శాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్, నవీన్ కుమార్, టీజీఓ జిల్లా కార్యదర్శి వనజా రెడ్డి, సంఘ బాధ్యులు శివకుమార్, వివిధ సంఘాల నాయకులు గంగాధర్, డీఈఓ ప్రణీత పాల్గొన్నారు.

ఐసెట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థి ప్రతిభ



సాకి ప్రణీత్

ఆదిలాబాద్‌టౌన్: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఐసెట్ పరీక్ష ఫలితాల్లో జిల్లా విద్యార్థి ప్రతిభ కనబర్చాడు. తలమడుగు మండలం ఖోడద్ గ్రామానికి చెందిన సాకి ప్రణీత్ శుక్రవారం విడుదలైన పరీక్ష ఫలితాల్లో 110.91 మార్కులతో 304వ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, గ్రామస్తులు ప్రణీత్‌ను అభినందించారు.

నేలలోకి దిగేలా... పక్షుల బెడద తీరేలా




నైరుతి రుతుపవనాల రాకతో రెండు రోజుల కిందట జిల్లాలో మోస్తారు వర్షాలు కురిసాయి. దీంతో వానాకాలం సాగు పనులు ఊపందుకున్నాయి. జిల్లాలో అత్యధికంగా పత్తి, సోయా పంటలను సాగు చేస్తున్నారు. పంట చేనుల్లో వేసిన విత్తనాలు పక్షులు తినకుండా అవి భూమిలోకి వెళ్ల మొలకెత్తేలా రైతులు ఇలా అరక సాయంతో కొమ్మ కొడుతూ విత్తనాలు నేలలోకి దిగేలా చేస్తున్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పాచ్చెర గ్రామంలో ఈ దృశ్యం కనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

భార్యను హతమార్చిన భర్తకు జీవిత ఖైదు

నిర్మల్‌టౌన్: ప్రియురాలు మోజులో పడి భార్యను హతమార్చిన ఘటనలో భర్తకు నిర్మల్ న్యాయస్థానం జీవిత ఖైదీ, జరిమానా విధించింది. కోర్టు సమన్వయల అధికారి సక్రియ నాయక్ వివరాల ప్రకారం.. కుభీర్ మండలంలోని గలిసింగ్‌తండాకు చెందిన రాథోడ్ మనీష్‌తో రాథోడ్ మీరాబాయి(26)కి 2012లో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. సొంత గ్రామంలో వ్యవసాయ పనులు దొరకకపోవడంతో మనీష్ భార్యతో కలిసి భైంసాలో కుంటాల రాజాలింగు వద్ద వ్యవసాయ కూలీగా పనిలో చేరాడు. ఈ క్రమంలో భైంసాలోని ఫాండ్రిగల్లికి చెందిన ఓ మహిళతో మనీష్‌కు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ క్రమంలో భార్య మీరాబాయికి తెలియకుండా నిజామాబాద్‌కు వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న మీరాబాయి తన ఇద్దరు పిల్లలను తీసుకుని అత్తమామల దగ్గరికి వెళ్లింది. కొద్దిరోజుల తరువాత మనీష్ తన ప్రియురాలితో మీరాబాయి ఉంటున్న ఇంటికి వచ్చాడు. దీంతో భార్యాభర్తలిద్దరికీ గొడవ జరిగింది. గ్రామ పెద్దలు పంచాయితీ నిర్వహించి ఇద్దరితో కలిసి ఒకే ఇంట్లో గొడవలు లేకుండా ఉండాలని ఒప్పందం చేశారు. మళ్లీ కొద్ది రోజుల తరువాత గొడవలు మొదలయ్యాయి. దీంతో ప్రియురాలితో కలిసి మీరాబాయిని 13 ఫిబ్రవరి 2019న ఉదయం గొంతు నులిపి హత్య చేశాడు. అనంతరం అక్కడి నుంచి పారిపోయాడు. మృతురాలి తండ్రి జాదవ్ దత్తురం ఫిర్యాదు మేరకు కుభీర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై రమేశ్ కేసు నమోదు చేసి విచారణ చేయగా సీఐ ప్రవీణ్ నిందితుడిపై చార్జిషీట్ దాఖలు చేసి కోర్టులో హాజరు పరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కల్వకుంట్ల వినోద్‌రావు 16 మంది సాక్షులను ప్రవేశ పెట్టి నేరం రుజువు చేయడంతో రాథోడ్ మనీష్‌కు జీవిత ఖైదీతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణ కుమార్ శుక్రవారం తీర్పునిచ్చారు.

యువతి హఠాన్మరణం



శ్రావణి (ఫైల్)

తాంసి: పనిచేసుకుంటూ స్పృహ తప్పి కిందపడి యువతి మృతిచెందిన ఘటన భీంపూర్ మండలంలోని నిపాని గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మెడిపల్లి భూమన్న, లక్ష్మి రజక వృత్తి పనులు చేసుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. వారి ఏకైక కూతురు మెడిపల్లి శ్రావణి(22) డిగ్రీ పూర్తిచేసి ప్రభుత్వ ఉద్యోగం కోసం ఇంటి వద్ద ప్రిపరేషన్ అవుతోంది. ఈ క్రమంలో తల్లిదండ్రులకు తోడుగా శుక్రవారం బట్టలు ఉతికేందుకు వెళ్లింది. బట్టలు ఆరవేస్తున్న క్రమంలో స్పృహ తప్పి కిందపడిపోయింది. గమనించిన స్థానికులు ఆస్పత్రికి తీసుకెళ్లే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందింది. కూతురు మృతదేహం వద్ద తల్లిదండ్రులు విలపించిన తీరు అందరిని కంటతడి పెట్టించింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఖానాపూర్: మండలంలోని ఎక్బాల్‌పూర్ గ్రామంలోని జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన కోటగిరి నర్సాగౌడ్ ఎప్పటిలాగే వృత్తిరీత్యా పని ముగించుకొని ఖానాపూర్‌లోని ఇంటికి వెళ్లేందుకు బైక్‌తో రోడ్డుపైకి వచ్చాడు. అదే సమయంలో మామడ మండలం కొత్తూరు గ్రామానికి చెందిన అగ్గు మల్లేశ్ ఖానాపూర్ నుండి మామడ వైపు బైక్‌పై వెళ్తూ ఎక్బాల్‌పూర్ వద్ద నర్సాగౌడ్ బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో నర్సాగౌడ్‌తో పాటు మల్లేశ్‌కు సైతం గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రులను ప్రభుత్వాస్పత్రికి తరలించారు.